క్లుప్తంగా

ఐదుగురు వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

గూడూరు: మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కుమారి జయశ్రీకి అందజేశారు. కాగా ఇప్పటి వరకు మండలంలో 26 మంది వలంటీర్లు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెకు చెందిన నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం రాజీనామా పత్రాలను ఎంపీడీఓ భాగ్యలక్ష్మికి అందజేశారు. తమపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు మనస్తాపంతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన



ఆర్‌జీఎం కళాశాలను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎం, స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి నెరవాడమెట్ట వద్ద ఉన్న ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల గదులను నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఆర్జీఎంలో నందికొట్కూరు, శ్రీశైలం, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, ఫార్మసీ కళాశాలలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచే గదులు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట అడిషినల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఎస్పీ రవీంద్రానాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే



బిలకలగూడూరులో ప్రచారం చేస్తున్న శివనరసింహారెడ్డి

గడివేముల: టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలతో పెత్తనం చెలాయిస్తారని.. ప్రజలకు కష్టాలు తప్పవని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిన విషయం ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేయానికి వస్తున్నారని.. వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. నిరంతరం అందుబాటులో ఉండే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలన్నారు. పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖరరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మేఘనాథరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, సర్వేశ్‌రెడ్డి, పుల్లయ్య, ప్రతాప్‌రెడ్డి, బాషా, గోపాలయ్య, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పర్సన్ ఇన్‌చార్జ్ నియామకానికి జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి ప్రతిపాదనలు పంపారు. శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలోని మార్కెట్ కమిటీ పాలక వర్గం పదవీ కాలం ఈ నెల 24వ తేదీతో పూర్తి అయింది. ఎన్నికల కోడ్ ఉండటంతో పదవీ కాలాన్ని పొడిగించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ ఏడీఎంకు నివేదించారు. ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు పంపినట్లు ఏడీఎం తెలిపారు. పర్సన్ ఇన్‌చార్జ్‌గా మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులును నియమించే అవకాశం ఉంది.

నేడూ విద్యుత్ బిల్లుల చెల్లింపు

కర్నూలు(అగ్రికల్చర్): గృహ, వాణిజ్య విద్యుత్ బిల్లులు ఇంకా రూ.18 కోట్ల వరకు బకాయిలుగా ఉన్నాయని, వీటిని ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పనిచేస్తాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేదలకు అండగా జగనన్న పాలన

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్ష

సి.బెళగల్: జగనన్న పాలనలో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తోందని.. అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి మరోసారి ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం సి.బెళగల్ మండలంలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ఓటు అడుగుతున్న దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. ఐదేళ్లలో అర్హులందరికీ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టించారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించారని తెలిపారు. పథకాలు ఇలాగే కొనసాగాలన్నా.. అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పేరుతో కొత్త డ్రామాను ఫిక్స్ చేసిందని ఎద్దేవా చేశారు.ఎన్ని కూటములు వచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

ప్రజా సేవకుడిగా ఉంటా

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని.. తనను ఆశీర్వదించాలని ఆదిమూలపు సతీష్ అభ్యర్థించారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కోడుమూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

టీడీపీ అభ్యర్థి వెంట ఫ్యాక్షన్ నేత

మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెంట ఫ్యాక్షన్ , గుండా నాయకుడు ఉన్నాడని ఆరోపించారు. టీడీపీ అభ్యర్థి, వారి నాయకులు ప్రజాప్రతినిధులుగా ఉన్న గ్రామాల్లో ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదన్నారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎంపీపీ బొంతల మునెప్ప, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, సర్పంచ్ ఇమ్మానియేల్, నాయకులు నరసింహుడు, సీబీ తులసిరెడ్డి, హనుమంతు, పాండురంగన్న, శ్రీనివాసరెడ్డి, పెద్ద నాగప్ప, ప్రభాకర్‌రెడ్డి, సీబీ గోవింద రెడ్డి, మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, పులిరాజు, హరున్‌రషీద్ పాల్గొన్నారు.



సి.బెళగల్: ఇనగండ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సతీష్, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



సతీష్, కోట్ల హర్ష సమక్షంలో పార్టీలో చేరిన మునగాల టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని మునగాలలో టీడీపీకి చెందిన 50 కుటుంబాలు శనివారం కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుంకన్న, మద్దిలేటిరెడ్డి, రామాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి కోట్ల హర్ష, సతీష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కోడుమూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన గోరంట్ల మాజీ సర్పంచ్ నక్కా పరమేశ్వర నాయుడు



వర్కూరు టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం

కోడుమూరు రూరల్: రానున్నది జగనన్న ప్రభుత్వమేనని.. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ తెలిపారు. మండలంలోని వర్కూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, పాపిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ముస్లిం, వాల్మీకి నాయకులు రఫీ, సుభాన్, ఉస్మాన్, మహబూబ్‌బాషా, ఖాజాహుసేన్, రెడ్డి, మిన్నెల్ల, ఆదులషన్, రజాక్‌మియ్యా, ముల్ల హుసేన్, షేక్షావలి, నభిసా, మహమ్మద్, మాసుం, మక్బుల్, గౌస్, అలీబాషా, అమీర్‌బాషా, మిన్నెల్ల హుసేనిలతో పాటు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ చంద్రబాబు మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఉన్నారు.

గోరంట్ల మాజీ సర్పంచ్ వైఎస్సార్‌సీపీలో చేరిక

కోడుమూరు మండలం గోరంట్లకు చెందిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ నక్కా పరమేశ్వర నాయుడు, మాజీ ఉపసర్పంచ్ చిన్న మాదన్న, వార్డు సభ్యురాలు లాలెమ్మతో కలిసి శనివారం కర్నూలులో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



నవరత్నాల భరోసా

ఎన్నికల మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ విడుదల చేసింది. నవరత్నాలు ప్లస్ పేరుతో విడుదల చేసిన మేనిఫెస్టోపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో జగన్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ఇప్పుడు ప్రకటించిన పథకాలతో తమ జీవితాల్లో మరింత వెలుగులు నిండుతాయని సంతోషం వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్ వర్క్

సొంత ఇంటి కల నేరవేరింది



చాలా ఏళ్లు బాడుగ ఇంట్లో నివాసం ఉన్నాం. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా పెద్దటేకూరు గ్రామంలోని జగనన్న కాలనీలో మాకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చింది. స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసింది. మా సొంతి ఇంటి కల నెరవేరింది. మాకు అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలు వస్తున్నాయి. వాటిని పెంచుతామని చెప్పడం సంతోషంగా ఉంది. –బి. శ్రీదేవి, పెద్దటేకూరు, కల్లూరు

పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు



గతంలో రూ.2 వేలు ఉన్న పింఛన్‌ను రూ.3 వేలు చేశారు. ఇప్పుడు రూ.3,500 చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఏదైనా ఒక మాట చేప్పారంటే తప్పకుండా చేస్తారనే నమ్మకం ఉంది. ఇంటికి పెద్ద కొడుకులా మా కష్టాలను తీర్చుతున్న ఆయన్ను ఆ దేవుడు చల్లగా చూడాలి.

–జంగం పుల్లమ్మ అహల్యాపురం

డ్రైవర్లకు భరోసా



వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఇప్పటి వరకు లబ్ధి పొందాం. మళ్లీ గెలిస్తే ఈ పథకాన్ని కొనసాగిస్తానని జగనన్న చెప్పడం సంతోషం. గతంలో ఐదేళ్లలో రూ.50వేల అందింది. ఇప్పుడు రూ.లక్ష అందేలా మేనిఫెస్టోలో చెప్పడం సంతోషంగా ఉంది. అలాగే సొంత టిప్పర్, లారీ, ఆటో, ట్యాక్సీ కొనుగోలు కోసం బ్యాంకుల నుంచి రూ.3లక్షల వరకు వడ్డీ లేని రుణాలిస్తామనడం వల్ల వాహన రంగంలో ఉండేవారి కుటుంబాలు బాగుపడతాయి. –పోలా మద్దిలేటిస్వామి, డ్రైవర్, కొణిదేడు

పిల్లల చదువుకు ఇబ్బంది లేదు



గూడూరు: అమ్మ ఒడి పథకం మాలాంటి పేదల పిల్లల చదువులకు ఎంతగానో చేయూతనిస్తోంది. ఇప్పుడిస్తున్న రూ.15 వేలను రూ.17 వేలకు పెంచుతానని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం సంతోషంగా ఉంది. ఈయన చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం ఉంది. మేనమామలా పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ఆయనకు అండగా ఉంటాం. –లలిత, గూడూరు

అమ్మ ఒడి సాయం పెంచడం సంతోషం



నేను, నా భర్త మధు కలిసి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నా కుమారుడు స్థానిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పేద కుటుంబంలో ఉన్న మాలాంటి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదువులు చదివించాలంటే సాధ్యం కాదు. వ్యాపారంలో అరకొర వచ్చే డబ్బులతోనే కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి. అమ్మ ఒడి పథకంలో ఇస్తున్న నగదును రూ.17 వేలకు పెంచడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–కొమ్ము రమాదేవి, గడివేముల

జగన్‌తోనే బంగారు భవిష్యత్తు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఓర్వకల్లు మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం

ఓర్వకల్లు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని.. నిత్యం పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతివ్వాలని పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని కొమరోలు, వెంకటాపురం, చెన్నంశెట్టిపల్లె, సోమయాజులపల్లె, చింతలపల్లె, పాలకొలను గ్రామాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోగర్ బాషాతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. జై జగన్..జై కాటసాని నినాదాలతో అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గమనించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. 2014-19 టీడీపీ పాలన, 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తారతమ్యాలను గమనించాలని కోరారు. గత ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి చూపించారన్నారు. మాట ఇచ్చాడంటే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిలోనూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. ప్రజల కోసం పనిచేస్తున్న వ్యక్తులు కావాలో? కల్లబొల్లి మాటలు చెప్పి మభ్యపెట్టే వ్యక్తులు కావాలో? తేల్చుకోవాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా గత ఐదేళ్లలో కేవలం ఐదు గ్రామాల్లో సుమారు రూ.56 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పాటు పాఠశాలల రూపురేఖలను మార్చివేశారన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చిన ఘనత జగన్‌దేనని తెలిపారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామచంద్రుడు, జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మధన్‌వెంకట రెడ్డి, ఆకుల వెంకటరెడ్డి, అబ్రహం, బోయ రామకృష్ణ, చంద్రారెడ్డి, స్వాములు, నాగేశ్వరరావు, నాగశేషులు, భగవంత్‌రెడ్డి, పెద్ద గిడ్డయ్య. రామమద్దయ్య, రమేష్, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న కాటసాని



ప్రచార రథంపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

రైతు పక్షపాతి జగన్



రుణమాఫీ పేరుతో గతంలో చంద్రబాబు రైతులను మోసం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రైతు పక్షపాతిగా ఉంటూ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారు. అంతేగాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎన్నో సదుపాయాలను కల్పించారు. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయాన్ని రూ.16 వేలకు పెంచుతానని హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది.

–తేనేశ్వరరెడ్డి, రైతు, కోడుమూరు

వాహన డ్రైవర్లకు ప్రమాద బీమా పెంపు హర్షణీయం



సొంత వాహన డ్రైవర్లకు గతంలో ప్రమాద బీమా కింద అరకొరగా పరిహారం అందించేవారు. అయితే సీఎం జగన్ డ్రైవర్ల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచడం హర్షించ దగ్గ విషయం. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం. –విజయుడు, డ్రైవర్, గూడూరు

మా నమ్మకం జగన్



గతంలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.13500 అందించేవారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో రైతులను మరింత ఆదుకునేందుకు రూ.16 వేలు పెంచడం సంతోషంగా ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వందశాతం సీఎం జగన్ నెరవేర్చుతారనే నమ్మకం ఉంది. రైతులకు అన్ని విధాల ఆదుకుంటూ ఆర్థికంగా అండగా నిలిచిన జగన్‌కే మా మద్దతు. – కురువ శివశంకర్,గడివేముల

రూ.10 లక్షల బీమాతో ధీమా



మేనిఫెస్టోలో సొంత ఆటో, మ్యాక్సీక్యాబ్‌లు కలిగిన యజమానులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇస్తామని చెప్పడం డ్రైవర్లకు భరోసానిస్తోంది. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారికి రూ.3 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉంది.

–రవి, ఆటో డ్రైవర్

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే



గని గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

గడివేముల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య అన్నారు. గడివేముల మండల పరిధిలోని గని గ్రామంలో గ్రామస్తులు, ఆయా పార్టీల రాజకీయ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అలజడులు, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బైడోవర్ కేసులు నమోదు చేయడానికి వెనకాడమని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పాలనకు జగన్‌ను గెలిపించుకుందాం

కోడుమూరు రూరల్: ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించి గెలిపించుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ ప్రజలను కోరారు. శనివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పేదలకు, పెత్తందారుల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు పొందాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఇందిరవరప్రభ, నాగరాజు, నాయకులు పులకుర్తి సత్యారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ప్రసాద్, సూరన్న, నాగేంద్ర, వెంకటేష్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగన్

కోడుమూరు రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ భార్య స్టెల్లా సతీష్ అన్నారు. శనివారం కోడుమూరులోని కొండపేటలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలంతా మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మాదులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు మల్లారెడ్డి, తేనేశ్వరరెడ్డి, కల్యాణ్, లింగమయ్య, లింగన్న, రాఘవేంద్ర, విష్ణుదాసు, కట్టెల శ్రీనివాసులు, వెంకటేష్, సుబ్బారావు, జగదీష్, ఈరన్న, సురేష్, రవిశంకర్, మాసుమ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

గూడూరు రూరల్: రాష్ట్రం మరింత అభివృద్ధి సాధించాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ సతీమణి స్టెల్లా సతీష్ అన్నారు. మండల పరిధిలోని గుడిపాడులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మరింత మేలు జరగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ బాటలు వేశారన్నారు. ఆమె వెంట నాయకులు ముత్యాలస్వామి దేవి, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, సురేష్, ప్రసాద్, ప్రకాష్, ఎల్లప్ప, లక్ష్మన్న, రామ్‌రెడ్డి ఉన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు



గుడిపాడులో ప్రచారం చేస్తున్న స్టెల్లా సతీష్

నేడు పెంచికలపాడులో విగ్రహ ప్రతిష్ట

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో కొత్తగా నిర్మించిన దేవాలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి, కుమారస్వామి, కాశీ విశ్వనాథస్వామి, నందికేశ్వర, ఆంజనేయస్వామి విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించనున్నట్లు చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రతి ఆశా వద్ద మందుల కిట్ ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశాలు తమ వద్ద ఎప్పుడూ మందుల కిట్‌లను నిర్వహణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా హెచ్‌బీఎన్‌సీ డ్రగ్ కిట్‌లను ఆశాలకు డీఎంహెచ్‌ఓ అందజేశారు. ఈ డ్రగ్ కిట్‌లలో అమోక్సిలిన్ సిరప్‌లు 5, ఓఆర్ఎస్ ప్యాకెట్లు 5, జింక్ సిరప్‌లు 5, పారాసిటమాల్ సిరప్‌లు 5, పారాసిటమాల్ డ్రాప్స్ 5 బాటిల్స్ ఉంటాయన్నారు. ఈ డ్రగ్ కిట్‌లను ప్రతి ఒక్క ఆశా వద్ద ఉంచుకోవాలన్నారు. గృహ సందర్శన చేసినప్పుడు 0 నుంచి 42 రోజుల్లోపు పిల్లల్లో ఏమైనా ప్రమాదపు లక్షణాలు ఉంటే గుర్తించి వారిని మెడికల్ ఆఫీసర్ వద్దకు రెఫర్ చేయాలన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com